క్లుప్తంగా

రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌కు సన్మానం



జబ్బార్‌ను సన్మానిస్తున్న మిర్యాలగూడ మైనార్టీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియామకమైన ఎంఏ జబ్బార్‌ను గురువారం మిర్యాలగూడ మైనార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. జబ్బార్‌ను సన్మానించిన వారిలో కార్మిక సంఘం, మైనార్టీ నాయకులు ఖాజా హామీదుద్దీన్, ఎంఏ లతీఫ్, ఎంఏ రహీం తదితరులున్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా కరుణాకర్



నియామక పత్రం అందుకుంటున్న కరుణాకర్

పెద్దఅడిశర్లపల్లి : మండల కేంద్రానికి చెందిన పోతెం కర్ణాకర్ బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియామకం చెందారు. ఈ మేరకు గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి కరుణాకర్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

నేడు సీపీఐ సమావేశం

దేవరకొండ : దేవరకొండ మండల సీపీఐ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి నూనె రామస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశానికి సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి సీపీఐ మండల సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

అందుబాటులో బత్తాయి, నిమ్మ మొక్కలు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్న అడిశర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల కొండ లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన పరిశోదన కేంద్రంలో రైతులకు కావాల్సిన బత్తాయి, నిమ్మ మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఉద్యానవన సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ సి.హెచ్.రాజుగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో బత్తాయి మొక్కకి రూ.110, నిమ్మ మొక్కకి రూ.50 చొప్పున చెల్లించి పొందాల్సిందిగా సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అడవిదేవులపల్లి : వాడపల్లి 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 7గంటల నుంచి 12గంటల వరకు 132 సబ్ స్టేషన్ నుంచి 33 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శ్రీను ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో అడవిదేవులపల్లి మండలంలోని అడవిదేవులపల్లి, కొత్తనందికొండ, సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

ఫొటోగ్రాఫర్‌కు ఆర్థికసాయం



నగదు అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

నల్లగొండ: పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ పెరిక గణేశ్ ఇటీవల ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న నల్లగొండ పట్టణ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం గణేశ్ ఇంటికి వెళ్లి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు కంభంపాటి రవి, దాసపత్రి జనార్దన్, పెరిక నాగరాజు, సామల వెంకటేశ్వర్లు, గంధం రూపేంద్రకుమార్, ధనుంజయ గౌడ్, శ్యామల తుకారాం పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య పరీక్షలు

నల్లగొండ టూటౌన్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నూకల జగదీష్ చంద్ర, పందిరి శ్యాంసుందర్ తెలిపారు. హైదరాబాదులోని వనస్థలిపురం మ్యాక్సీ విజన్ శ్రీ మహాలక్ష్మీ కంటి ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్లు చేస్తారని పేర్కొన్నారు.

మత్స్యకారులకు వలసబాట తప్పదా!

- డిండి ప్రాజెక్టు నుంచి సాగుకు నీటి విడుదల
- నీరు తగ్గతుండడంతో చేపల వేటకు ఇబ్బంది
- వలస బాటనే దిక్కంటున్న మత్స్యకారులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



డిండి ప్రాజెక్టులో అడుగంటిన నీరు

డిండి : నిజాం కాలంలో(1940–43 సంవత్సర మధ్య కాలం) అప్పటి చీఫ్ ఇంజనీరైన ఖాజా అజ్మోద్దిన్ దుందుబి నది పరివాహక ప్రాంతంలో నల్లగొండ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల సరిహద్దు డిండి మండల కేంద్రంలో ప్రాజెక్టును నిర్మించారు. అప్పటి నుంచి వర్షాధారంపైనే ఈ ప్రాజెక్టు ఆధారపడి ఉంది. చేపల వేటపై ఆధారపడి బతుకుతున్న మత్స్యకారులకు కూడా జీవనాధారంగా నిలుస్తోంది. ప్రాజెక్టు నూతనంగా నిర్మించిన సమయంలో 20 మంది మత్స్యకారులతో ప్రారంభమైన చేపల వేట, ప్రస్తుతం జిల్లాలోని డిండి, నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉప్పునుంతల, వంగూరు మండలాల్లో మొత్తం 600 కుటుంబాలు చేపల వేటపై ఆధారపడి బతుకుతున్నాయి.

సాగుకు నీటిని వదలడంతో..

ఈ ఏడాది వానాకాలం సాగుకు ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటిని వదలడంతో అధికారుల లెక్కల ప్రకారం దాదాపు 45 రోజుల్లో ప్రాజెక్టు పూర్తిగా ఖాళీ అవుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులో ఈ ఏడాది ఉచిత చేపపిల్లలను వదలేదు. దీంతో మత్స్యకారులుకు చేపల వేట ఉండదు. రోజురోజుకు ప్రాజెక్టులో నీరు ఖాళీ అవుతుండటంతో చేపట వేట తగ్గి మత్స్యకారులకు పని లేకుండా పోయింది. భవిష్యత్‌లో కుటుంబం గడవడం కష్టంగా మారుతుందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లక తప్పదా అని మత్స్యకారులు వాపోతున్నారు . ఈ విషయంపై ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి పెట్టి ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తది



ఈ ఏడాది సరైన వర్షాలు కురవక పోడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండలేదు. ప్రాజెక్టులో ఉన్న నీటిని ఆయకట్టు పొలాల సాగుకు వదలడంతో ప్రాజెక్టు ఖాళీ అవుతుంది. దీంతో చేపట వేట స్థానికంగా కరువై ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి బతకాల్సి వస్తుంది.

– నూకం చంద్రయ్య, మత్స్యకారుడు, డిండి

మత్స్యకారులను ఆదుకోవాలి



చేపల వేటనే జీవనాధారంగా చేసుకొని బుతుకుతున్న మత్స్యకారులకు కరువు భృతి అందించి వారిని ఆదుకోవాలి. అర్హులైన మత్స్యకారులకు సబ్సిడీ రుణాలతోపాటు ఇందిరమ్మ ఇండ్లను కెటాయించాలి.

– మేకల కాశన్, మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడు, డిండి

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు



గోదాంను పరిశీలిస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్‌రావు, తదితరులు

మిర్యాలగూడ : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్‌ఓ వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని బియ్యం సరఫరా ఎంఎల్ఎస్ పాయింట్‌తోపాటు పలు రేషన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాప్ నంబర్ 17లో 10క్వింటాళ్ల వరకు బియ్యం తేడా రావడంతో డీలర్ నిర్మలపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు రేషన్ బియ్యంపై అవకతవకలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా కార్డు దారులు రేషన్ బియ్యాన్ని రేషన్‌డీలర్‌కు గాని, ఇతరులకు గాని విక్రయిస్తే కార్డులను రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్‌రావు, సివిల్ సప్లయ్ డీటీలు జావిద్, జ్యోతి, లింగుస్వామి, ఆర్ఐ సురేందర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌కు సన్మానం



శ్రీకాంత్ గౌడ్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘం నేతలు

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించిన నూతి శ్రీకాంత్‌ను గురువారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మిర్యాలగూడకు చెందిన బీసీ సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. చైర్మన్ సత్కరించిన వారిలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగడి జీడయ్య యాదవ్, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షులు కర్నాటి యాదగిరి, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఐతగోని జనార్ధన్ గౌడ్ తదితరులున్నారు.

'డబుల్' లబ్ధిదారుల ఆందోళన



కోదాడ - జడ్చర్ల రహదారిపై రాస్తారోకో చేస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు

దేవరకొండ : పట్టణ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు పలువురు గురువారం ఆందోళనకు దిగారు. గత కొన్ని నెలల క్రితం తమను డబుల్ బెడ్ రూం ఇళ్లకు లాటరీ పద్ధతిన అర్హులుగా ఎంపిక చేసి పట్టాలు అందించారని, డబుల్ ఇళ్ల వద్ద కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై కొద్దిసేపు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద విద్యుత్ సౌకర్యం, మంచినీటి వసతి లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు వాపోయారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ, ఈఓ

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలోని 26 గ్రామపంచాయతీలలో గురువారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామపంచాయతీల నుండి మొత్తం 58 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ రాంరెడ్డి తెలిపారు. 29 గ్రామపంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరబాబు, కోట్ల సతీష్, ప్రవీణ్, అంగన్‌వాడి టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

దేవరకొండ : సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో ఇప్పటికే పారిశుద్ధ్య నివారణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇళ్లల్లో నీరు నిల్వ ఉండే కుళాయిలు, పూల కుండీలు, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది నిత్యం వార్డుల్లో తగు జాగ్రత్తలు తెలియజేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ బాలికల జట్టుకు జెర్సీలు అందజేత

నల్లగొండ : మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా జట్టు క్రీడాకారిణులకు గురువారం ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి జెర్సీలు అందజేశారు. అనంతరం డాక్టర్ ఓరుగంటి శ్రీనివాస్ భగవద్గీత పుస్తకాలు, స్టీల్ వాటర్ బాటిళ్లను అందించారు. కార్యక్రమంలో బండారు ప్రసాద్, కందగట్ల దాస్, సుమిత, హుస్సేన్, కరుణాకర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ హాశం

నల్లగొండ టౌన్ : పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లాటరీ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి ఎండీ. సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 2017లో రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ పట్టణంలో 552 ఇళ్లు నిర్మించిందని, డ్రెయినేజీ, విద్యుత్, మంచినీటి సౌకర్యం, అంతర్గత రోడ్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల లబ్ధిదారులకు స్వాధీనం చేయలేదన్నారు. 2023 ఫిబ్రవరిలో డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ నేటివరకు వారికి ఇళ్లను స్వాధీనం చేయకపోవడం అన్యాయమన్నారు. నూతన ప్రభుత్వం వెంటనే ఇళ్లను స్వాధీనం చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కుంభం కృష్ణారెడ్డి, అద్దంకి నర్సింహ, సైదాచారి పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్ల దినోత్సవం

నల్లగొండ: పానగల్ చౌరస్తాలో ఉన్న భగీరథ సర్కిల్‌లో గురువారం ఇంజనీర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద ఇంజనీర్లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ డి.వెంకటేశ్వర్లు, టీజీఓ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ముజీబుద్దీన్, మధు, నరసింహ, సంపత్, రామకృష్ణ, రవి, సంతోష్‌రెడ్డి, రమేష్, గోకుల్ సాయి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి ఒడిబియ్యం

కనగల్ : దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. గురువారం నల్లగొండ పట్టణానికి చెందిన 40మంది మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం, వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు వనమా పారిజాత, వందనపు జ్యోతి, సోమవరపు సమంత, రమ, లీలా, సరోజ, సునిత, జ్యోతి, భాగ్య, కవిత, రాణి, సుమతి, శోభ, సరస్వతి, కల్పన, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు గేట్‌వాల్వ్

- వారం రోజులుగా తాగునీరు బంద్



హిల్‌కాలనీ డౌన్‌పార్కు వద్ద కొత్త గేట్ వాల్వ్‌ను బిగిస్తున్న సిబ్బంది

నాగార్జునసాగర్ : పైలాన్‌కాలనీ నుండి హిల్‌కాలనీకి వచ్చే పైపులైన్‌కు ఏర్పాటు చేసిన గేట్ వాల్వ్ మరమ్మతులకు గురికావడంతో వారం రోజులుగా హిల్‌కాలనీ వాసులకు తాగునీటి సరఫరా నిలిచి పోయింది. గతంలో ఇదే చోట పలుమార్లు గేట్ వాల్ చెడిపోవడంతోపాటు పైపులైన్ డ్యామేజ్ అయ్యింది. ఈ సారి పూర్తిగా చెడిపోవడంతో కొత్త గేట్‌వాల్‌ను గురువారం అమర్చారు. రేపటి నుండి కాలనీలోని 6వార్డులకు వంతులవారిగా నీరు సరఫరా చేసేందుకు మరో రెండు రోజుల సమయం పట్టనుంది. ఇదే కాకుండా సాగర్ జలాశయంలో నీటి మట్టం తగ్గడంతో కాలనీలకు పంపింగ్ చేసేందుకు మోటార్లకు నీరు సరిగా అందకుండా పోతుంది. ముఖ్యంగా జలాశయంలోని నీరు గాలికి తెప్పలు ఎగిసి పడుతుండటంతో డ్యాం గోడల దగ్గరనుండి లోపలకు నీరు జరిగినపుడు మోటార్లకు నీరు అందడం లేదని నీటి సరఫరా విభాగానికి చెందిన సిబ్బంది తెలిపారు. ఇప్పటికైనా నిధులు కేటాయించి హిల్ కాలనీకి ప్రత్యేకంగా నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా రైతు భరోసా నిధులు జమ చేయకుండా జాప్యం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో పార్టీ హుజూర్‌నగర్, మేళ్లచెర్వు మండలాల కార్యదర్శులు పోషణబోయిన హుస్సేన్ పాల్గొన్నారు.

స్వచ్ఛ మిర్యాలగూడగా తీర్చిదిద్దేందుకు కృషి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



డ్రెయినేజీ నుంచి చెత్తను తొలగిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : స్వచ్ఛ పట్టణంగా మిర్యాలగూడను తీర్చిదిద్దేందుకు తనవంతుగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పట్టణంలోని ఏరియా ఆస్పత్రి నుంచి ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టణ అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. తమది మిర్యాలగూడ అని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకునే విధంగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దాలన్నారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉన్నందున పారిశుద్ధ్య కార్మికులు డ్రెయినేజీలు శుభ్రం చేయాలన్నారు. రోగుల బారిన పడి ప్రజలకు వైద్యులు మెరుగైన వైద్యం అందించాలన్నారు. మిర్యాలగూడను పారిశుద్ధ్యం, విద్యలో, వైద్యంలో ముందుండేలా ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాలు మిర్యాలగూడ వైపు చూసేలా కృషి చేయాలన్నారు. వార్డుల్లోని డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తను ఎమ్మెల్యే పారిశుద్ధ్య కార్మికకులతో కలిసి తొలగించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, వైద్యారోగ్య, పారిశుద్ధ్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

విద్య, వైద్య సౌకర్యాల్లో లోటుపాట్లు ఉండొద్దు

- కలెక్టర్ నారాయణరెడ్డి
- తిప్పర్తి పీహెచ్‌సీ, కేజీబీవీ తనిఖీ



తిప్పర్తి పీహెచ్‌సీలో వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రామగిరి(నల్లగొండ): పేద ప్రజలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా విద్య, వైద్య సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన తిప్పర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం, కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సిబ్బంది హాజరు, మందుల స్టాక్, ల్యాబ్ టెస్టుల రిజిస్టర్లను పరిశీలించారు. కేజీబీవీలో సౌకర్యాల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పేషెంట్లు, విద్యార్థినులతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి వివరాలు, చిరునామా, ఫోన్ నంబర్‌తో సహా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ల్యాబ్ రిపోర్టులను ఎప్పటికప్పుడే పేషెంట్‌కు పంపించాలన్నారు. అనధికారికంగా విధులకు గైర్హాజరైన ఫార్మసిస్ట్‌పై చర్య తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. సకాలంలో ల్యాబ్ రిపోర్టులు పంపించని ల్యాబ్ టెక్నిషియన్ పైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలని సిబ్బందిపై చర్య తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు చేపట్టిన పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మాడుగులపల్లి మోడల్ స్కూల్‌ను తిప్పర్తి కేజీబీవీ ఇంటర్ భవనంలో నిర్వహించడం వల్ల వసతి ఇబ్బందిగా ఉందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వేములపల్లి మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌కు మార్చాలని డీఈఓను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఎంపీడీఓ, తహసీల్దార్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ టూటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కలెక్టర్ నారాయణరెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. పెన్షనర్లకు నగదురహిత వైద్యం అందించాలని, పెండింగ్‌లో ఉన్న డీఆర్ విడుదల చేయాలని, పీఆర్సీ ప్రకటించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు జి.దామోదర్ రెడ్డి, జిల్లా శ్రీశైలం, గాయం నారాయణరెడ్డి, నూనె రంగయ్య, రామలింగం, ఆర్.అమృతారెడ్డి, యుగంధర్ రెడ్డి, ఆంజనేయులు, యాదగిరి ఉన్నారు.

కోర్టు భవన నిర్మాణ పనుల పరిశీలన



కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

నిడమనూరు : నిడమనూరులో ఎన్ఎస్‌పీ క్యాంపులో నిర్మాణంలో ఉన్న నూతన కోర్టు భవన నిర్మాన పనులను ఆర్డీఓ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి గురువారం పరిశీలించారు. కోర్టు భవనం వద్ద అక్రమంగా నిర్మించుకున్న ఇళ్లను వదిలి వేయాలని, వారికి ప్రభుత్వ స్థలం, పక్కా ఇల్లు మంజూరు చేస్తుందని ఆర్డీఓ వారికి తెలిపారు. కోర్టు భవనం పూర్తి కాగానే కోర్టు నిర్వహణ సందర్భంగా ఆవరణలో అడ్డుగా ఇళ్లు ఉన్నందున ఇబ్బందిగా ఉంటుందని ఆయన అన్నాడు. తహసీల్దార్ కార్యలయంలో న్యాయవాదులతో ఆర్డీఓ శ్రీనివాసరావు సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రషీద్, న్యాయవాదులు శ్రీనివాస్‌యాదవ్, ఉన్నం సత్యనారాయణ తదితరులున్నారు.

ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా రమేష్



రమేశ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

గుర్రంపోడు : మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా మండలంలోని తేనపల్లి గ్రామానికి చెందిన శివార్ల రమేశ్ నియమితులయ్యారు. గురువారం జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న జారీ చేసిన నియామకపత్రాన్ని నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అందజేశారు. తన నియామకానికి సహకరించిన ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని శివార్ల రమేష్ తెలిపారు.

గాయం నర్సింహారెడ్డికి ఘన నివాళి

హుజూర్‌నగర్ : పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం తొలితరం న్యాయవాది గాయం నర్సింహారెడ్డి చిత్రపటానికి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జక్కుల వీరయ్య, న్యాయవాదులు కాల్వ శ్రీనివాస్‌రావు, నట్టే సత్యనారాయణ, నగేష్ రాథోడ్, చనగాని యాదగిరి, బాణావత్ సురేష్, కొట్టు సురేష్, అంజయ్య, వెంకటరెడ్డి, ఉదారి యాదగిరి, నవీన్‌యాదవ్, వెంకయ్య, మహేష్‌నాయక్, మోహన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

హుజూర్‌నగర్ : మహిళా అదృశ్యంపై గురువారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన తోట వెంకటేశ్వర్లు తన భార్య అరుణ, ఇద్దరు కుమారులను ఇంటి వద్ద ఉంచి రెండు రోజులు వ్యాపారం నిమిత్తం నల్లగొండకు వెళ్లాడు. ఈనెల 2వ తేదీన ఇంటికి తిరిగి రాగా ఇంట్లో తన భార్య అరుణ లేదు. దీంతో బంధువుల ఇళ్లు, తెలిసిన వారి ఇళ్లలో వెతికాడు. అయినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు

పెద్దవూర : మండలంలోని పెద్దగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి పదోన్నతి పొందిన, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామస్తులు, విద్యార్థులు గురువారం ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. విద్యాభివృద్ధి వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు రేపాల అశోక్, మారం రవీందర్, మధు, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, జంగాల అరుణ, చంద్రకళ, అరుణ తదితరులు పాల్గొన్నారు.